# మధ్యాహ్న భోజన కార్మికుల శ్రమను దోచుకోవడం ఆపాలి : ఏఐటీయూసీ ఆరోపణ

**నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :** రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల శ్రమను దోచుకుంటోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌ను కార్మికులు ముట్టడించారు. ఈ సందర్భంగా గేట్ల వద్ద బైఠాయించి ప్రభుత్వ మొండి వైఖరిపై నిప్పులు చెరిగారు. ధర్నానుద్దేశించి ఓమయ్య మాట్లాడుతూ.. ఆగస్టు నెల నుంచి వంట బిల్లులు, గౌరవ వేతనాలు రాకపోవడంతో కార్మికులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో ఒక్కో కోడిగుడ్డు ధర రూ.8 పైనే ఉంటే, ప్రభుత్వం కేవలం రూ.6 మాత్రమే చెల్లిస్తోంది. ఒక్కో గుడ్డుపై రూ.2 భారాన్ని పేద కార్మికులు ఎలా భరిస్తారు అని ప్రశ్నించారు. పెరిగిన గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరల వల్ల అప్పులు తెచ్చి వంట చేయడం ఇప్పుడు భారంగా మారిందని, అప్పులు ఇచ్చేవారు కూడా ముందుకు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు వర్తింపజేస్తున్నట్లుగానే మధ్యాహ్న భోజన కార్మికులకు కూడా గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా బిల్లులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల ఆకలి తీర్చే కార్మికుల కడుపు కొడుతూ ప్రభుత్వం కాలయాపన చేయడం దారుణమన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా వ్యాప్తంగా వంటలు నిలిపివేసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు చక్రపాణి, జిల్లా వ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చిన కార్మికులు పాల్గొన్నారు.



# క్షణికానందాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :**
విద్యార్థులు మొబైల్ ఫోన్ల వంటి క్షణికానందాలకు బానిసలై తమ విలువైన భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని ప్రముఖ సైకాలజిస్ట్, లైఫ్ కోచ్ అడ్డిగ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం సాలూర మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు అమ్మ, నాన్నే మన దేవుళ్ళు అనే అంశంపై ప్రత్యేక స్ఫూర్తిదాయక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ ప్రసంగించారు. నేటి విద్యా వ్యవస్థలో మార్కుల వేటలో పడి విద్యార్థులు నైతిక విలువలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కన్నతల్లి దండ్రులను గౌరవించడం, ఉపాధ్యాయుల పట్ల వినయంగా ఉండటం సంస్కారవంతమైన విద్యకు నిదర్శనం అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు నిరంతరం ప్రశ్నించడం, శ్రద్ధగా వినడం, మంచిని అనుసరించడం వంటి అలవాట్లను పెంపొందించుకోవాలని, అప్పుడే సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని వివరించారు. సెల్‌ఫోన్ల అతి వినియోగం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత లోపిస్తోందని, ఇది దీర్ఘకాలంలో మానసిక ఒత్తిడికి దారితీస్తుందని హెచ్చరించారు. స్వల్పకాలిక సంతోషాల కంటే విద్య ద్వారా వచ్చే దీర్ఘకాలిక విజయంపై విద్యార్థులు దృష్టి సారించాలని కోరారు. క్రమశిక్షణతో కూడిన అధ్యయనమే భవిష్యత్తుకు బలమైన పునాది అని, ప్రతి విషయాన్ని శ్రద్ధతో చదివితే జ్ఞాపకశక్తిలో నిక్షిప్తమవుతుందని మెలకువలు నేర్పారు.

మహనీయుల బాటలో నడవాలి: ఎంఈఓ రాజీ మంజుషా

సాలూర మండల విద్యాధికారిణి, ప్రధానోపాధ్యాయురాలు రాజీ మంజుషా గారు మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే మంచి లక్ష్యలను ఏర్పరచుకోవాలన్నారు. మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని విద్యార్థులను కోరారు. ఇటువంటి అవగాహన సదస్సులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయ బృందం శ్రీనివాస్ ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురానే విజయ్ కుమార్, గంధం సాయిలు, దండు రాజ్ కుమార్, రుద్ర సంతోష్ యాదవ్, విఠల్ కాంబ్లే, అరుణ్ కుమార్ పాలెంకర్, గాండ్ల అబ్బయ్య, సంగీతరావు, లింబగిరి జ్యోత్స్న, శోభారాణి, సుధారాణి, విజయ?క్ష్మ, బగరే లక్ష్మ, వనజ, స్వర్ణ, మేడి రవి, జాదవ్ అక్షయ్, సాయిలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.





# ఆకతాయిల ఆట కట్టిద్దాం విద్యార్థినులకు పోలీసుల భరోసా

**నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :**
విద్యార్థినులు సమాజంలో ధైర్యంగా ఎదగాలని, ఈవ్ టీజింగ్ వంటి వేధింపులు ఎదురైతే మౌనంగా భరించకుండా తక్షణమే షీ టీమ్‌ను ఆశ్రయించాలని ఆర్మూర్ డివిజన్ షీ టీమ్ ఇన్‌ఛార్జిలు విగ్నేశ్, సుమతి పిలుపునిచ్చారు. గురువారం కమ్మర్ పల్లి మండలంలోని హస కొత్తూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ అంశాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే మార్గాల్లో గానీ, ప్రయాణాల్లో గానీ ఎవరైనా అపరిచిత వ్యక్తులు వేధింపులకు గురిచేస్తే భయపడాల్సిన అవసరం లేదన్నారు. “ఆకతాయిల ఆట కట్టించేందుకు ప్రభుత్వం షీ టీమ్‌లను ఏర్పాటు చేసింది. వేధింపులకు గురయ్యేవారు 8712659795 నంబర్‌కు వాట్సాప్ ద్వారా లేదా అత్యవసర సమయంలో డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి” అని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని, బాధితులకు పూర్తి రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. నేటి డిజిటల్ కాలంలో సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం పట్ల విద్యార్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వారు హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్ స్నేహాలు ప్రమాదకరమని, వ్యక్తిగత ఫోటోలు, వివరాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దని వివరించారు. సైబర్ నేరగాళ్లు రకరకాల ఆశలు చూపి మోసం చేస్తారని, అలాంటి ఉచ్చులో పడితే తక్షణమే పోలీసులను సంప్రదించాలని కోరారు. ఆత్మరక్షణే మహిళలకు శ్రీరామరక్ష అని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, వందలాది మంది విద్యార్థినులు పాల్గొన్నారు.



# అధికార దర్పంతో వేధిస్తే న్యాయమే గెలిచింది : ముత్యాల సునీల్ కుమార్

**-నేను నిప్పు.. అందుకే కుట్రలు సాగలేదు**

**- రూ.112 కోట్ల ప్రభుత్వ సొమ్ము ఎగ్గొట్టిన చరిత్ర నీది కాదా?**

**- మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డికి 'బాల్కొండ' కాంగ్రెస్ ఇంచార్జ్ బహిరంగ సవాల్**

**నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :** నిజాయితీగా వ్యాపారం చేస్తూ, ధర్మాన్ని నమ్ముకున్న నాకు దైవమే తోడు నిలిచింది. రాజకీయ కక్షతో నన్ను బదనాం చేయాలని చూసిన వారికి కోర్టు తీర్పు తగిన గుణపాఠం చెప్పింది అని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. తనపై జరిగిన జీఎస్టీ విచారణ తదనంతర పరిణామాలపై గురువారం ఆయన మోర్తాడ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుల తీరును, మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు. ఆరెంజ్ ట్రావెల్స్ సంస్థపై జరిగిన విచారణ కేవలం వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టేందుకే జరిగిందని సునీల్ కుమార్ విమర్శించారు. తెలంగాణలో 12 శాతం, ఇతర రాష్ట్రాల్లో 5 శాతం జీఎస్టీని క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని, కావాలని తనపై ఒత్తిడి తెచ్చి రూ.28 కోట్లు అదనంగా కట్టాలని వేధించారని ఆరోపించారు. అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి అరెస్టు చేయాలని చూసినా, కోర్టు వాస్తవాలను గ్రహించి తనకు న్యాయం చేసిందని తెలిపారు. ఈ కుట్రల వెనుక మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి హస్తం ఉందని, తన పరిచయాలతో తప్పుడు ప్రచారం చేయించారని ధ్వజమెత్తారు. నీతులు చెబుతున్న మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి చరిత్ర అంతా అవినీతిమయమని సునీల్ కుమార్ దుయ్యబట్టారు. బట్టాపూర్ క్రషర్ ద్వారా కేవలం పదివేల క్యూబిక్ మీటర్లకు అనుమతి తీసుకుని, ఐదు లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను అక్రమంగా తవ్వి ప్రభుత్వానికి రూ.112 కోట్ల బకాయి పడ్డ వ్యక్తి ప్రశాంత్ రెడ్డి అని ఆరోపించారు. కనీసం రూ.52 లక్షల కరెంటు బిల్లులు కూడా కట్టలేని వారు ఇప్పుడు ధర్మ సూత్రాలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో రూ.6 వేలకు దొరికిన ఇసుకను ఇప్పుడు తాము రూ.3 వేలకే అందిస్తుంటే, ఇసుక మాఫియా అంటూ దొంగ ఏడుపులు ఏడుస్తున్నారని మండిపడ్డారు.

చర్చకు సిద్ధమా? తేదీ తేల్చుకో!ప్రశాంత్ రెడ్డికి దమ్ముంటే సంక్రాంతి లోపు ఎప్పుడైనా ముఖాముఖి చర్చకు రావాలని సునీల్ కుమార్ సవాల్ విసిరారు. తేదీ, సమయం మీరే నిర్ణయించండి. ఎవరు అవినీతిపరుడో, ఎవరు బకాసురుడో నియోజకవర్గ ప్రజల ముందే తేల్చుకుందాం. ఒకవేళ చర్చకు రాకుంటే మిమ్మల్ని బట్టాపూర్ దొంగ'గా ప్రజలే గుర్తిస్తారుని హెచ్చరించారు. అధికారంలో ఉన్నప్పుడు అక్రమాలకు పాల్పడి, ఇప్పుడు బురద చల్లాలని చూస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అంగన్ వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**- అసెంబ్లీలో ప్రస్తావిస్తా**

**- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**



**ఆదిలాబాద్ జిల్లా: నేరదిగొండ జనవరి 08(డిడి9 వార్త న్యూస్)**
తెలంగాణ అంగన్ వాడి టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదిలాబాద్ జిల్లా నెరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసం లో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్ వాడి టీచర్లు వారి సమస్యలను పరిష్కారం చేయాలనీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వం తమకు 18 వేలు వేతనం అందిస్తామని హామీ ఇచ్చారని రిటైర్మెంట్ బెనిఫిట్స్ సైతం అందట్లేదని తమకు కళ్యాణ లక్ష్మ సైతం రాదని అంగన్ వాడి సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ హామీలకే పరిమితమైన కాంగ్రెస్ అమలుచేయడంలో లేదని కచ్చితంగా అంగన్ వాడి టీచర్లకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానన్నారు. తక్షణమే సంబంధిత అధికారితో మాట్లాడి ప్రభుత్వానికి మరియు తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు.

# కల్దుర్కిలో ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :**
బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామ శివారులో బుధవారం అర్ధరాత్రి దుండగులు రెచ్చిపోయారు. వ్యవసాయ క్షేత్రాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని విలువైన కాపర్ వైరుతో పాటు ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. కౌలు రైతు రాము తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం పొలానికి వెళ్లిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు చిందరవందరగా పడి ఉండటం చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. పంటలు చేతికి వచ్చే సమయంలో విద్యుత్ పరికరాల చోరీ జరగడంతో సాగునీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై విద్యుత్ శాఖ (ట్రాన్స్‌కో) ఏఈకి ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. పోలీసులు, విద్యుత్ అధికారులు స్పందించి చోరీకి పాల్పడిన వారిని పట్టుకోవాలని, వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

# ఎంఈఓను తక్షణమే తొలగించాలి



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :**
ఎడపల్లి మండల విద్యాశాఖ అధికారి నిరంకుశ పోకడలను నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య తిరుగుబాటు బావుటా ఎగురవేసింది. గత సోమవారం వడ్డెర కాలనీలో జరిగిన చిన్న సంఘటనను సాకుగా చూపి, ఒక ఉపాధ్యాయుడిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించడం విద్యా వ్యవస్థకే మచ్చ అని సంఘాల నేతలు మండిపడ్డారు. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి సదరు ఎంఈఓను తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఎంఈఓ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఉపాధ్యాయులను మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఏదైనా సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి తప్ప, ఉపాధ్యాయులను పోలీసుల దగ్గరకు పంపడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు పి. మోహన్ రెడ్డి, ఎస్టీయూ శ్రీకాంత్, బీటీఎఫ్ స్వామి నాయక్, టీఆర్‌టీఎఫ్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో వసతులు పక్కాగా ఉండాలి: కమిషనర్ జాదవ్ కృష్ణ

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :**
రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బోధన్ మున్సిపల్ యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది. మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చే సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రతి కేంద్రంలో మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా ర్యాంపులను సిద్ధం చేయాలని ఆదేశించారు.

# సంస్కృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత : డీటీవో ఉమామహేశ్వరరావు

- ఘనంగా ఇందూర్ పాఠశాల సంక్రాంతి వేడుకలు



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :** విద్యార్థులు చిన్నతనం నుండే మన దేశ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా రవాణా అధికారి ఉమామహేశ్వరరావు అన్నారు. బోధన్ పట్టణంలోని ఇందూర్ ప్రైమరీ స్కూల్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆధునిక కాలంలో ఎక్కడ ఉన్నా మన మూలాలను, పండుగల విశిష్టతను మర్చిపోవద్దని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఆవరణలో గ్రామీణ వాతావరణం ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన పల్లెటూరు సెట్టింగ్‌ను ఆయన తిలకించి హర్షం వ్యక్తం చేశారు. చిన్నారులతో కలిసి పండుగ జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఆర్టీవో శ్రీనివాస్, సీఐ వెంకట్ పాల్గొని పండుగ విశిష్టతను కొనియాడారు. కార్యక్రమంలో నారాయణ పాఠశాల కరస్పాండెంట్ కోడాలి కిషోర్, బోధన్ ట్రస్మా అధ్యక్షుడు హరికృష్ణ, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ఆటపాటలతో పాఠశాల ప్రాంగణంలో పండుగ కోలాహలం నెలకొంది.

# హెల్మెట్ బరువు కాదు బాధ్యతగా భావించాలి : బోధన్ ఏసీపీ శ్రీనివాస్

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :** ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం (హెల్మెట్) ధరించడం ద్వారానే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుండి తప్పించుకోగలరని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలో ఆర్టీఏ, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఆచన్‌పల్లి చౌరస్తా నుండి అంబేడ్కర్ చౌరస్తా వరకు నిర్వహించిన హెల్మెట్ ర్యాలీని ఏసీపీ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించడాన్ని ఒక నిబంధనగానో, బరువుగానో కాకుండా.. ప్రాణ రక్షణ కోసం ఒక బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు తలకు తీవ్ర గాయాలు కావడం వల్లే అత్యధికంగా ప్రాణనష్టం జరుగుతోందని, శిరస్త్రాణం ధరిస్తే మరణాల




ముప్పును నివారించవచ్చని వివరించారు. రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండటం వల్ల సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, మితిమీరిన వేగంతో ప్రయాణించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అధికారులు హెచ్చరించారు. హెల్మెట్ ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్టీవో శ్రీనివాస్, సీఐ వెంకటనారాయణ, రూరల్ ఎస్సై మశ్చేందర్ రెడ్డి, పోలీసు సిబ్బంది, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు

# తెలంగాణ ఉద్యమకారుడు దిగంబర్ రావుకు ఘన నివాళి




**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :** మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన ఉద్యమకారుడు, మాతృశ్రీ విద్యాసంస్థల అధినేత సిరిగిరి దిగంబర్ రావు మృతి తీరని లోటని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ బోధన్ నాయకులు పేర్కొన్నారు. ఇటీవల ఆయన మరణించిన నేపథ్యంలో బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జేఏసీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దిగంబర్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బోధన్ జేఏసీ కోశాధికారిగా ఆయన అందించిన సేవలను, ఉద్యమ సమయంలో ఆయన ప్రదర్శించిన పట్టుదలను నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. విద్యావేత్తగా, సామాజిక కార్యకర్తగా బోధన్ ప్రాంతాభివృద్ధికి ఆయన పడ్డ తపన ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జయశ్రీ, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్, విద్య సాగర్, కోడలి కిశోర్, చక్రవర్తి, సాయిబాబా, మల్లేష్, హరికృష్ణ, శివరాజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సేవలో అంకితభావానికి దక్కిన గుర్తింపు



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :** ప్రభుత్వ విద్యా సంస్థల్లో అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తగిన గుర్తింపు లభిస్తుందని బోధన్ పట్టణం తట్టికోట్ హైస్కూల్ ఉపాధ్యాయురాలు లలితకుమారి నిరూపించారు. ఆమె జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన నేపథ్యంలో పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రకళ, బస్వేశ్వర్ మాట్లాడుతూ.. లలితకుమారి బోధనా పద్ధతులు విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయని తెలిపారు. సామాజిక కార్యకర్త సనా పటేల్ పాల్గొని ఆమెను అభినందిస్తూ, ఇలాంటి పురస్కారాలు ఉపాధ్యాయుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# రసాయన ఎరువులకు స్వస్తి పలకాలి : ఉద్యాన అధికారి రాజు

ప్రస్తుత కాలంలో మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల భూమి నిస్సారమవ్వడమే కాకుండా మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఉద్యాన శాఖ అధికారి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వేల్పూర్ మండలం రామన్నపేటలో సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వాణిజ్య పంటల కంటే ముందుగా తాము తినే కూరగాయలను సేంద్రియ పద్ధతుల్లో పండించుకోవాలని పిలుపునిచ్చారు. వంటింటి వ్యర్థాలు, పశువుల ఎరువులతో సాగు చేయడం వల్ల నాణ్యమైన దిగుబడి వస్తుందని వివరించారు. ముఖ్యంగా ప్రతి ఏటా బయట మార్కెట్‌లో అధిక ధరలకు విత్తనాలు కొనకుండా, రైతులు తమ పంట నుండే స్వయంగా విత్తనాలను సేకరించి భద్రపరుచుకోవాలన్నారు. దీనివల్ల సాగు ఖర్చులు గణనీయంగా తగ్గి, వ్యవసాయం లాభసాటిగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు.

# మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు : టీవీపీ

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ అధ్యక్షుడు మిసాలే నాగేశ్ స్పష్టం చేశారు. గురువారం రెంజల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, వంట గదిని, బియ్యం నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన, పౌష్టిక విలువలతో కూడిన భోజనాన్ని అందించాలన్నారు. కొన్నిచోట్ల నాణ్యత లేని భోజనం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని, అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పాఠశాల యాజమాన్యం, వంట ఏజెన్సీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వంట గది పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కోరారు.

# అంక్సాపూర్ పాఠశాలలో రుచుల పండుగ

**నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :** వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమలోని వంట నైపుణ్యాన్ని చాటారు. గురువారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ నోరూరించే వంటకాలతో పాటు ఆరోగ్య సూత్రాలను మేళవించి అందరినీ ఆకట్టుకుంది. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, ఇంటి వద్ద స్వయంగా తయారుచేసిన వివిధ రకాల పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. జొన్న రొట్టెలు, చిరుధాన్యాల వంటకాలు, ఆకుకూరల మిశ్రమాలను ప్రదర్శిస్తూ వాటిలోని పోషక విలువల గురించి వివరించారు. ఈ వేడుకను చూసేందుకు వచ్చిన గ్రామస్థులు, తల్లిదండ్రులు విద్యార్థుల ప్రతిభను చూసి ఆశ్చర్యపోయారు.

# ఓటరు జాబితాలో తప్పులొస్తే ఉపేక్షించం : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా తయారీలో అధికారులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గురువారం ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. ఒక్కో వార్డును యూనిట్‌గా తీసుకుని ఓటర్ల వివరాలను సరిచూడాలని, అభ్యంతరాలు ఉంటే పరిష్కరించి ముసాయిదా జాబితాను ప్రదర్శించాలని తెలిపారు. ముఖ్యంగా అనవసర తప్పిదాలు జరిగితే సంబంధిత బూత్ లెవల్ అధికారులను, సూపర్ వైజర్లను బాధ్యులుగా పరిగణిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, మున్సిపల్ కమిషనర్ శ్రావణి, తహశీల్దార్ సుజాత తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయురాలి వేధింపులు ఆపాలి : గురుకుల విద్యార్థినుల ధర్నా

**దూషిస్తూ.. కొడుతున్నారని ఆవేదన**

**కార్యదర్శి రమణకుమార్‌చే విచారణ జరిపిస్తాం: ప్రిన్సిపల్**



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :** గురుకుల పాఠశాలల్లో విద్యార్థినుల పట్ల బాధ్యతగా మెలగాల్సిన ఉపాధ్యాయులే వేధింపులకు పాల్పడుతుండటంపై విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎడపల్లి బాలికల గురుకులంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు రజిని ప్రవర్తనపై బాలికలు గురువారం నిరసన చేపట్టారు. తమపై దాడులు చేస్తూ, అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని వారు వాపోయారు. ఈ విషయమై ప్రిన్సిపల్ గంగా శంకర్‌ను వివరణ కోరగా.. సదరు ఉపాధ్యాయురాలిని ప్రస్తుతం సెలవుపై పంపినట్లు తెలిపారు. త్వరలోనే గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి రమణకుమార్ పాఠశాలకు వచ్చి పూర్తిస్థాయి విచారణ చేపడుతారని, బాధ్యులపై చర్యలు ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. అప్పటి వరకు విద్యార్థినులు శాంతించాలని కోరారు.

# పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజేశ్వర్



**నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :** ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నిజామాబాద్ జిల్లాకు చెందిన జన్నారపు రాజేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరంగల్ వేదికగా మూడు రోజుల పాటు అత్యంత ఉత్సాహంగా జరిగిన పీడీఎస్‌యూ 23వ రాష్ట్ర మహాసభల్లో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ, అందరినీ కలుపుకుపోయే నేతగా గుర్తింపు పొందిన రాజేశ్వర్‌ను రాష్ట్ర కమిటీకి ఎంపిక చేయడం పట్ల జిల్లా విద్యార్థి నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, జిల్లాలోని విద్యా రంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని పేర్కొన్నారు.

# న్యాయవాదుల రక్షణ చట్టాన్ని పటిష్టం చేయాలి

**- హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ గౌడ్**

**- పెండింగ్ సమస్యల పరిష్కారానికి హామీ**




**నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :** న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు రక్షణ చట్టాన్ని పటిష్ట పరచాలని, వారి సంక్షేమానికి పెద్దపీట వేయాలని హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తిలో ఉన్నవారికి సామాజిక భద్రత కల్పించడంలో తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు. వెల్ఫేర్ ఫండ్ నిధుల పెంపు, ఇన్సూరెన్స్ పరిమితి పెంపు వంటి అంశాలపై ఇప్పటికే స్పష్టమైన కార్యాచరణతో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మామిళ్ల సాయిరెడ్డి, మాణిక్ రాజ్, సీనియర్ అడ్వకేట్లు దయాకర్ గౌడ్, రెంజర్ల సురేష్, ముత్యాల శ్యాం బాబు, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

# చోరీ కేసును ఛేదించిన పోలీసులు.. కానిస్టేబుళ్లకు ప్రశంసలు

**నిజామాబాద్ జిల్లా జనవరి 08(డీడీ9 వార్త) :** ఆర్మూర్ పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు దాసరి అనిల్ కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు, గురువారం పంత్ రోడ్డు మరియు రామ్ నగర్ కాలనీల దొంగతనాల కేసులో అతడిని నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు కిరణ్ కుమార్, హరీష్‌లను ఎస్హెచ్‌వో సత్యనారాయణగౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. నిందితుడిని గమనించి చాకచక్యంగా వ్యవహరించడం వల్లనే దొంగ పట్టుబడ్డాడని ఆయన కొనియాడారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని ఆయన కోరారు.

